
ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY


ఆర్టీసీ ఉద్యోగుల
ఆందోళన బాట
- అపాయింటెడ్ ప్రకటించాలని డిమాండ్
- నల్లగొండ రీజియన్ పరిధిలో 3వేలకు పైగా ఉద్యోగులు



7

అమల్లోకి కొత్త పాలసీ


నల్లగొండ సమీపంలోని ఆర్జాలబావి వద్ద లారీలోకి ధాన్యాన్ని ఎగుమతి చేస్తున్న హమాలీలు

- జిల్లాలో నూతన సీఎంఆర్‌కు అంగీకరించిన మిల్లర్లు
- గత రెండు సీజన్ల సీఎంఆర్‌పై ఉన్నతాధికారుల ప్రశంసలు
- ఈ సీజన్‌లోనూ అదే స్ఫూర్తితో కొనసాగాలనే సూచనలు
- 10 శాతం బ్యాంకు గ్యారెంటీతో మిల్లర్లకు ధాన్యం కేటాయింపులు

కొత్త సీఎంఆర్ పాలసీకి అనుగుణంగా నల్లగొండ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు అధికారయంత్రాంగం శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఈ వానాకాలంలో దాదాపు ఆరు లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరుపుతారనే అంచనాతో ఆ మేరకు సీఎంఆర్ కేటాయించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధంచేసింది. జిల్లాలో గతేడాది వానాకాలంలోనూ 3.22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సీఎంఆర్‌కు కేటాయించారు. ఈసారి సన్నధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుండడం, వచ్చే సంక్రాంతి నుంచి పేదలకు రేషన్‌కార్డుల ద్వారా సన్నబియ్యాన్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో, ఈమేరకు సన్నధాన్యం మిల్లింగ్‌కు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.
(ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ స్వయంగా జిల్లాలో పర్యటించి అధికారులు, మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఈ సీజన్‌లో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సన్నధాన్యం కొనుగోలుని విజయవంతం చేసేందుకు సూచనలందించారు. మిల్లర్లు సైతం తొలుత సీఎంఆర్ పర్సంటేజీ తగ్గించాలని డిమాండ్ చేసినా మిల్లింగ్ చార్జీలు పెంచడం, పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో ఆమేరకు మిల్లింగ్‌కు అంగీకరించారు. జిల్లాలో నాన్ ఆయకట్టు ప్రాంతాల్లో వస్తున్న ధాన్యం ఇప్పటికే ఊపందుకోగా, ఈవారం నుంచి నాగార్జునసాగర్ ఆయకట్టు నుంచి ధాన్యం వస్తుందని అందుకనుగుణంగా మిల్లింగ్‌కు సన్నాహాలు మొదలుపెట్టారు.

10 శాతం బ్యాంకు గ్యారంటీని వినియోగించుకోవాలి

సీఎంఆర్ పాలసీలో చేసిన మార్పులను మిల్లర్లు సద్వినియోగం చేసుకొని ధాన్యం కొనుగోళ్లలో, సీఎంఆర్ పాలసీలో ప్రభుత్వానికి సహకరించాలని అధికారులు సూచిస్తున్నారు. గతేడాది వరకు మిల్లింగ్‌కు దొడ్డు ధాన్యానికి క్వింటాకు రూ.10 ఇస్తే, తాజాగా దాన్ని రూ.40కి పెంచామని, సన్నధాన్యానికి రూ.20 నుంచి రూ.50కి పెంచామని, దీన్ని మిల్లర్లు సద్వినియోగపర్చుకోవాలని పౌరసరఫరాలశాఖాధికారులు చెబుతున్నారు. కొన్నిజిల్లాల్లో సీఎంఆర్ కేటాయించిన ధాన్యం పక్కదారి పట్టడం, కొందరు మిల్లర్లు డిఫాల్టర్లుగా మారిన నేపథ్యంలో దీన్ని కట్టడి చేసేందుకు ప్రభుత్వం ఈసారి బ్యాంకు గ్యారంటీలను రంగంలోకి తెచ్చింది. నల్లగొండ జిల్లాలో డిఫాల్ట్ మిల్లులు లేకపోవడం, గత ఖరీఫ్‌కు సంబంధించి దాదాపు 99శాతం సీఎంఆర్ రావడంతోపాటు, రబీలోనూ ఇప్పటికే 75శాతం బియ్యం వచ్చిందని, ఈ నేపథ్యంలో జిల్లాలో 10 శాతం బ్యాంకు గ్యారంటీతోనే మిల్లర్లకు సీఎంఆర్ కింద ధాన్యం కేటాయిస్తామని పౌరసరఫరాలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్ చౌహాన్ మంగళవారం నిర్వహించిన మిల్లర్ల సమావేశంలోనూ

మిగతా 8వ పేజీలో

ఊపందుకోని ప్రభుత్వ ధాన్యం కొనుగోళ్లు

జిల్లాలో ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇంకా కొనుగోళ్లు ఊపందుకోలేదు. జిల్లాలో సీజన్‌లో సన్న ధాన్యం 80కేంద్రాల్లో, దొడ్డురకాలు 260 కేంద్రాల్లో కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఇందుకుగాను ఇప్పటివరకు సుమారు 15వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం కేంద్రాల్లో కొనుగోలు చేశారు. సన్నధాన్యం ఇప్పటివరకు కేంద్రాలకు రావడం లేదు. సాగర్ ఆయకట్టులో వరికోతలు ఉధృతమైతేనే సన్నధాన్యం ప్రభుత్వ కేంద్రాలకు వస్తుందనే అంచనాలో అధికారయంత్రాంగం ఉంది.

రైతులకు సదుపాయాలు కల్పించాలి


తాటికల్ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఎస్‌వో వెంకటేశ్వర్లు

నకిరేకల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని అదనపు కలెక్టర్ జే శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. నకిరేకల్ మండలం తాటికల్, చీమలగడ్డ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించి, కొనుగోలు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిల్లుకు ధాన్యం వెళ్లిన రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ధాన్యానికి సంబంధించిన రికార్డులను జాగ్రత్తగా నిర్వాహకులు పాటించాలన్నారు. ఆయన వెంట డీఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఎం హరీష్, తహసీల్దార్ ఎస్‌కే జమీరొద్దిన్ తదితరులు ఉన్నారు.

కేతేపల్లి: ధాన్యం కొనుగోళ్లు, రవాణా మరింత వేగం పుంజుకోవాలని అదనపు కలెక్టర్ జే శ్రీనివాస్ సూచించారు. ఆయన బుధవారం కేతేపల్లి మండలంలోని ఇనుపాముల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఈ కేంద్రంలో నిల్వలు, కొనుగోళ్లు, రవాణా వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అలాగే కేంద్రంలోని ధాన్యం రాశులను పరిశీలించి, తేమశాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఎప్పటికప్పుడు ధాన్యం మాయిశ్చర్ తీస్తూ కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం రవాణా చేయడంలోనూ వేగం పెంచాలన్నారు. మిల్లుల్లో దిగుమతి చేసిన ధాన్యం ట్రక్ షీట్లు తెచ్చుకుని బిల్లులు చేసి రైతులకు మద్దతు ధర మేరకు డబ్బుల చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి విక్రయించిన రైతులు ఇబ్బంది పడకుండా చూడడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. డీఎస్‌వో ఊర వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల శాఖ డీఎం హరీష్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో పురుషోత్తం, డీటీ సత్తార్, ఆర్ఐ ఎండీ.చాంద్‌పాషా, ఏఈవో నాగరాజు ఉన్నారు.

న్యూస్ బాక్స్

సీపీఐ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న సత్యం

మర్రిగూడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీపీఐ 100వ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన పార్టీ మండల సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక, కర్షక రాజ్యం కోసం పోరాటం చేసిన సీపీఐ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో విజయాలు సాధించిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కార్పొరేట్ వర్గాలకు దేశ సంపదనంతా తాకట్టు పెడుతోందన్నారు. సమావేశంలో రఘుమయ్య, ఈదుల భిక్షంరెడ్డి, సురేష్, శేఖర్, నిరంజన్, మండల సహాయ కార్యదర్శి బి.సురేష్ పాల్గొన్నారు.

వైద్యుడి సిఫారసు లేకుండా మాత్రలు విక్రయిస్తే చర్యలు
- డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

నల్లగొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గైనకాలజిస్టు ప్రిస్కిప్షన్ లేకుండా ఎంటీపీ మాత్రలు విక్రయించకూడదని, విక్రయిస్తే మెడికల్ షాపులను మూసి వేస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ హెచ్చరించారు. జిల్లా ఆరోగ్య కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆడపిల్లల లోటు సమాజానికి చేటు అని, సమాజంలో స్త్రీ, పురుషులు సమానమని వారి మధ్య వివక్ష చూపకూడదన్నారు. పుట్టబోయేది ఆడబిడ్డ అని తెలియగానే కొన్ని కుటుంబాలు గర్భస్రావానికి సిద్ధపడుతున్నారని, గర్భస్రావం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రతి గర్భిణిని ప్రసూతీ అయ్యే వరకూ ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో మానిటరింగ్ చేయాలన్నారు. జిల్లాలోని అన్ని స్కానింగ్ సెంటర్లలో డెకాయి ఆపరేషన్లు చేసి పుట్టబోయేది ఆడబిడ్డ అని చెప్పే స్కానింగ్ సెంటర్లు, అందుకు సహకరించే వ్యక్తులపై గర్భస్థ పిండ పరీక్ష ప్రక్రియ నిరోధక చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గైనకాలజీ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ డా.స్వరూపరాణి, డాక్టర్లు సుచరిత, వందన, అరుందతి, వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణయ్య, గీత గ్రామ్యా, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు


సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): యాదగిరీశుడి సన్నిధిలో బుధవారం నిత్యపూజలు వైభవంగా కొనసాగాయి. సుప్రభాతంతో స్వామి అమ్మవార్లను మేల్కొల్పిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చనలు చేశారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవార్లను అలంకరించి ప్రత్యేకవేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణపర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన అర్చకులు అలంకార వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్థిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. శివాలయం, కొండపైన, కొండకింద మహిళ భక్తులు కార్తీక దీపాలు వెలిగించగా, ఆలయ ఖజానాకు రూ. 21,32,070 ఆదాయం సమకూరింది.

కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలి

- సేకరించిన వివరాలు గోప్యంగా ఉంటాయి
- ఎన్యూమరేటర్లకు చూపేందుకు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పట్టాదార్‌పాస్‌బుక్ సిద్ధంగా ఉంచాలి
- కలెక్టర్ ఇలా త్రిపాఠి


నల్లగొండలో కుటుంబ సర్వేను వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం ఇంటింటి కుటుంబ సర్వేను నల్లగొండ మునిసిపాలిటీ పరిధిలోని బీటీఎస్ కాలనీలో ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటి సర్వే సందర్భంగా సేకరించిన వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు చాలా ప్రాధాన్యమిస్తోందని, తప్పుడు సమాచారం ఇవ్వకుండా సరైన వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. ఎన్యూమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ధరణి పట్టాదారు పాస్ పుస్తకం వంటివి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సర్వేఫాంలో ఎన్యూమరేటర్లు ఎట్టి పరిస్థితుల్లో తప్పులు నింపవద్దని, ఏవైనా సందేహాలుంటే సూపర్‌వైజర్లు లేదా మునిసిపల్ కమిషనర్, ఎంపీడీవోలను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. ఇళ్ల జాబితా తయారీ సందర్భంగా ఇంటిని సందర్శించినట్లు స్టిక్కర్ అతికించాలని చెప్పారు. సర్వేఫాంలో పూర్తి వివరాలను నింపాలని, ప్రతీ ఇంటికి వెళ్లి సేకరించిన డేటాను ఆన్‌లైన్‌లో చేస్తామన్నారు. సమగ్ర సర్వేకు వివరాలు ఇచ్చేందుకు ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. మూడు స్థాయిల్లో సర్వేను పర్యవేక్షించడం జరుగుతుందని, ఇందుకు సూపర్‌వైజర్లు మండల ప్రత్యేక అధికారి, మునిసిపల్ కమిషనర్, జిల్లాస్థాయిలో అదనపు కలెక్టర్ నోడల్ అధికారిని నియమించామని, అంతేగాక ప్రతిరోజు టెలికాన్ఫరెన్స్, ఆకస్మిక తనిఖీల ద్వారా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నల్లగొండ ఆర్డీవో అశోకొరెడ్డి, మునిసిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా నిర్వహించాలి

మునుగోడు రూరల్: సమగ్ర కుటుంబ సర్వేను తప్పులు లేకుండా జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కుటుంబాలు, వంటలు వేరుగా ఉన్నప్పుడు మాత్రమే రెండు కుటుంబాల కింద పరిగణించాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో సర్వే వివరాలు తప్పుగా నమోదు చేయవద్దని, పూర్తి జాగ్రత్తగా ఆలోచించి వివరాలు నింపాలన్నారు. బుధవారం ఆమె మునుగోడు మండలం గూడపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను తనిఖీ చేశారు. రెండు కుంటుబాలను రాయించినంత మాత్రాన ఎక్కువ పథకాలు వస్తాయని అనుకోవద్దని, ఈ సర్వే కేవలం సమాచారం కోసం మాత్రమేనని తెలిపారు. కలెక్టర్ ఇంటింటికి వెళ్లి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సందర్భంగా ఇండ్ల జాబితా తయారీలో పాటించిన అంశాలు, పూరించిన ఖాళీలు, మండల సంఖ్య తదితర వివరాలను పరిశీలించారు.

తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి


పార్టీ జెండా ఆవిష్కరణ అనంతరం నినాదాలు చేస్తున్న నాయకులు

నల్లగొండ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ రూరల్ మండలానికి ప్రత్యేక తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని దొడ్డికొమరయ్య భవనంలో నిర్వహించిన సీపీఎం 8వ నల్లగొండ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తూ, కార్పొరేట్లను ప్రోత్సహిస్తోందన్నారు. పేదలను అక్కున చేర్చుకుని ఆదుకునే పరిస్థితి కేంద్ర ప్రభుత్వానికి లేదన్నారు. అదాని, అంబానీలకు అండదండలుగా ఉంటూ పేదప్రజలపై మోయలేని భారాన్ని మోపుతోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడానికి ప్రోత్సహిస్తున్నారని, అందుకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేసి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసి పత్తి రైతులకు మద్దతు ధర కల్పించాలన్నారు. వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీనియర్ నాయకుడు పాలడుగు నాగార్జున మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. తెల్ల రేషన్ కార్డులు లేక, ఉన్నా కుటుంబ సభ్యుల పేర్లు కొందరివి లేక అనేక విధాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రేషన్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. సభ ప్రారంభానికి ముందుగా సీపీఎం సీనియర్ నాయకుడు కుదతాల భూపాల్ జెండా ఆవిష్కరించారు. మహాసభలో మూడేళ్లుగా చేసిన కార్యక్రమాలపై సమీక్షించి, భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రకటించాలని ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని నిర్ణయించారు. కొండ అనురాధ, కృష్ణారెడ్డి, నలుపరాజు సైదులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎం సీనియర్ నాయకుడు సయ్యద్ హాశం, పాలడుగు ప్రభావతి, అంజయ్య, కొండ వెంకన్న, పోలే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి : జడ్పీ సీఈవో


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి

కనగల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరాలని జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ కో చైర్మన్ ఎంవీ గోనారెడ్డి ఆధ్వర్యంలో చినమాదారం ప్రైమరీ, హైస్కూల్‌కు చెందిన సుమారు 250మంది విద్యార్థులకు షూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులను కల్పించి కార్పొరేట్‌స్థాయిలో విద్యనందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. పేద విద్యార్థుల అభివృద్ధికి కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆయన కొనియాడారు. డీఈవో భిక్షపతి మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా విని సబ్జెక్టుల మీద పట్టు సాధించాలన్నారు. పదో తరగతిలో ఉత్తమ గ్రేడ్ సాధించి పాఠశాలకు గుర్తింపు తేవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మ, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈవీఎంల గోదాం తనిఖీ

నల్లగొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతీనెల నిర్వహించే సాధారణ తనిఖీలో భాగంగా కలెక్టరేట్‌లో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదామును కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌తో కలిసి తనిఖీచేశారు. ఈసందర్భంగా గోదాము వద్ద ఏర్పాటు చేసిన సెక్యూరిటీని, పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



సీఎం మూసీ బాటకు ఏర్పాట్లు
చకచకా

భీమలింగం కత్వ వద్దకు ఏర్పాటు చేసిన తాత్కాలిక రహదారి

వలిగొండ మండలం సంగెం బ్రిడ్జీ వద్ద సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం

యాదాద్రి, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ బాట పర్యటనకు అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. వలిగొండ మండలం సంగెం గ్రామం వద్ద గల అండర్ బ్రిడ్జీ వద్ద మూసీ నది వెంట సీఎం యాత్రను చేపట్టనున్నారు. ఈ మేరకు ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ అధికారులు సీఎం పర్యటించే ప్రాంతాల్లో మట్టి రోడ్లను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి సంగెం బ్రిడ్జీ వద్ద గల భీమలింగాన్ని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించనున్నారు. భీమలింగం వద్దకు వెళ్లేందుకు కాల్వ పక్కనుంచి మట్టితో దారిని ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు, కలెక్టర్ హనుమంతురావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ అధికారులు పరిశీలించారు. ముఖ్యమంత్రి సంగెం బ్రిడ్జీ వద్ద నుంచి బొల్లెపల్లి మీదుగా నాగిరెడ్డిపల్లి వరకు యాత్రను చేపట్టనున్నారు. ఈ మేరకు జిల్లాయంత్రాంగం రూట్‌మ్యాప్ ప్రకారం ఏర్పాట్లలో నిమగ్నమైంది. ముఖ్యమంత్రి పుట్టిన రోజును పురస్కరించుకుని మూసీ పరివాహక ప్రాంతంలోని ప్రజలతో మమేకం కానున్నారు.

ఏడాది లక్ష్యం మూడు నెలల్లో..
- సాగర్ ఎడమకాల్వ విద్యుత్ కేంద్రంలో అత్యధికంగా విద్యుదుత్పత్తి

7


ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్లకు 27వేలకు పైగా దరఖాస్తులు

● బుధవారం రాత్రి వరకు మరిన్ని పెరిగే అవకాశం

నల్లగొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ - ఖమ్మం - నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి బుధవారం సాయంత్రం నాటికి మూడు జిల్లాల్లోని 191 మండలాల్లో 27,446ఓట్ల నమోదుకు దరఖాస్తులు వచ్చాయి. బుధవారం చివరి రోజు కావడంతో రాత్రి వరకు మరికొన్ని ఓట్ల దరఖాస్తులు పెరిగే అవకాశాలు ఉన్నాయి. అయితే ఎన్నికల సంఘం గడువు పెంచుతుందా లేదా అనేది చూడాల్సి ఉంది. అత్యధికంగా హనుమకొండలో 5,333ఓట్లకు దరఖాస్తులు నమోదు కాగా, రెండవ స్థానంలో నల్లగొండ జిల్లాలో 5,191 ఓట్లకు దరఖాస్తులు నమోదయ్యాయి. సిద్దిపేట 183 దరఖాస్తులు, సూర్యాపేటలో 2,829, యాదాద్రి భువనగిరిలో 1662, జనగాంలో 1021, మహబూబాబాద్ 1473 దరఖాస్తులు వచ్చాయి. ఇక వరంగల్‌లో 2470 దరఖాస్తులు రాగా, జయశంకర్ భూపాల్‌పల్లి 340 దరఖాస్తులు, కొత్తగూడెం భద్రాద్రిలో 2125 దరఖాస్తులు, ఖమ్మంలో 4172 దరఖాస్తులు, ములుగులో 645 దరఖాస్తులు వచ్చాయి.

జెన్‌కో 1104 యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యాసయ్య

నాగార్జునసాగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ 1104 యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యాసయ్య ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో సంఘం రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఎన్నికల్లో ఆయన ఎన్నికయ్యారు. తన నియామకానికి సహకరించిన సంఘం నాయకులకు యాకయ్య కృతజ్ఞతలు తెలిపారు.

బ్రాండ్ ప్రొడక్ట్స్ నా ఆకాంక్ష

● అమ్మ అలంకరించుకునే తీరే నన్ను ఫ్యాషన్ వైపు ఆకర్షించింది ● కెమెరా ముందు నిలబడటమంటే ఇష్టం ● ఫోర్బ్స్ డిజిస్టార్ కొమిరెల్లి ఆకాంక్ష

ఆమె చదువుకుంది సాఫ్ట్‌వేర్ కానీ.. ఎంచుకుంది ఫ్యాషన్ రంగం. ప్రతిభతో ఫ్యాషన్ రంగంలో గుర్తింపు పొందింది. చిన్నతనంలో అమ్మ కట్టూ బొట్టూ, అలంకంరించుకునే తీరు విపరీతంగా ఆకట్టుకున్నాయి. అదే పెద్దయ్యాక తనను ఫ్యాషన్ వైపు ఆకర్షించేలా చేసింది. కెమెరా ముందు నిలబడడమంటే మరీ ఇష్టం. ఆ ఆసక్తి ఆమెను బ్యూటీ, ఫ్యాషన్‌లలో కంటెంట్ క్రియేటర్‌గా ఇన్‌స్టాగ్రాం, యూ ట్యూబ్‌లలో పోస్టు చేసిన వీడియోలు అలంకార ప్రియులను ఆకట్టుకునేలా చేశాయి. కార్పొరేట్ కాస్మోటిక్ కంపెనీల ప్రశంసలందుకొని ప్రతిష్ఠాత్మక 'ఫోర్బ్స్' మేగజైన్ ప్రకటించే టాప్-100 డిజిటల్ స్టార్ జాబితాలో చోటు దక్కించుకుంది నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని మాధవ ఎడవల్లి గ్రామానికి చెందిన కొమిరెల్లి ఆకాంక్ష 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

బిల్‌బోర్డుపై నా ఫొటో

ప్రముఖ కాస్మోటిక్ కంపెనీ గార్నియర్ తమ ఉత్పత్తుల ప్రచారం కోసం ముంబయ్‌లో ఓ బిల్‌బోర్డుపై నా ఫొటోను వాడటం నాకు ఆనందంగా అనిపించింది. వీటితో పాటు ప్రపంచవ్యాప్తంగా బిజినెస్ కలిగి ఉన్న ప్రముఖ ఆన్‌లైన్ సంస్థలు అమెజాన్, మింత్రో, నైకా, లారియర్ లాంటి సంస్థలు తమ ఉత్పత్తుల ప్రచారం కోసం వెబ్‌సైట్‌లో ప్రచారకర్తగా నియమించుకోవడం నా శ్రమకు తగ్గిన ఫలితంగా భావిస్తున్నా. ప్రముఖ నటీమణులతో కలిసి ప్రచార వీడియోల్లో పాల్గొన్నా. పైగా టెడెక్స్ లో నా అనుభవాలను పంచుకునే అవకాశం లభించింది. కాగా ప్రచార ప్రకటనల రూపొందించడం కోసం నా వీడియోలను వాడుకునేందుకు ఆ సంస్థలు ఇచ్చే పారితోషికాలు నేను జాబ్ చేయడం ద్వారా సంపాదించే దానికంటే కాస్త ఎక్కువే. ప్రతిష్ఠాత్మక ఫోర్బ్స్ మేగజైన్ ప్రకటించిన (2023-24) డిజిటల్ స్టార్‌గా ఎంపిక కావడం అంతకన్నా ఎక్కువేనని నా అభిప్రాయం.



దీపికా పదుకొణేతో ఆకాంక్ష

మాది నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని మాధవ ఎడవల్లి గ్రామం. నా తల్లిదండ్రులు కొమిరెల్లి అనంతరెడ్డి మమత. నాతో కలిపి మేము ముగ్గురం అక్కా చెల్లెళ్లం. నాన్న రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారాలు చేస్తారు. వ్యవసాయం కూడా ఉంది. అమ్మ మమత గృహిణి. నా పేరిట ఓ ఫిల్లింగ్ స్టేషన్ ఉంది. మమ్మల్ని మంచిగా చదివించాలనే తపనతో హైదరాబాద్‌కు మకాం మార్చారు. నాతో పాటు ఇద్దరు అక్కల వివాహాలు అయ్యాయి. నేను ఇంటర్ వరకు హైదరాబాద్‌లోనే చదివా. మహారాష్ట్ర పూణెలోని సింబయాసిస్‌లో బీ.టెక్ (ఎలక్ట్రానిక్ అండ్ టెలీ కమ్యూనికేషన్స్) కోర్సు పూర్తిచేశా. ప్రముఖ కంపెనీల్లో నా అర్హతకు తగిన ఉద్యోగాలు వచ్చాయి. వాటిని వదులుకుని ఇష్టమైన బ్యూటీ ఫ్యాషన్‌ల వైపు నా ఆసక్తి పెరిగింది.

నాన్న మొదట వద్దన్నారు

'అందరూ బీ.టెక్ చదవి ఉద్యోగంలో చేరడమో లేదా ఎంఎస్ చదివేందుకు విదేశాలకు వెళ్లడమో చేస్తుంటే నువ్వు బ్యూటీ, ఫ్యాషన్ వైపు వెళ్తానంటావేంటీ' అని నాన్న తొలుత వద్దన్నారు. బీ.టెక్ చదివినా ఉద్యోగం రాని వాళ్లుండగా మంచి ఉద్యోగం వేతనం వచ్చినా వదులుకోవడం సరైంది కాదంటూ ఆలోచించుకోమన్నారు. కానీ నా ఇష్టాన్ని నాన్నకు నిర్మొహమాటంగా చెప్పా. ఈ రంగంలో ప్రవేశించి ఆరు నెలలు ప్రయత్నిస్తా. నాకు ఆదరణ లభించకుంటే మీకు నచ్చినట్టే చేస్తానని నాన్నకు మాటిచ్చా. అందుకు ఆయన ఒప్పుకోవడంతో 2019 నుంచే బ్యూటీ, ఫ్యాషన్‌లకు సంబంధించిన కంటెంట్‌పై వీడియోలు చేసి ఇన్‌స్ట్రాగ్రాం, యూ ట్యూబ్‌లలో పోస్టు చేశా. కానీ ఆరు నెలల వరకు పెద్దగా ఆ రెండు ప్లాట్ ఫాంలలో ఆదరణ లభించలేదు.

విదేశీ వ్లాగ్స్‌తో టిప్స్

నేనెవరి వద్దా బ్యూటీ, ఫ్యాషన్‌కు సంబంధించిన శిక్షణ పొందలేదు. నాకు నేనే గురువుగా ప్రయత్నించా. నా ఐడియాతో చేసిన బ్యూటీ, ఫ్యాషన్ కంటెంట్ వీడియోలు అందాన్ని ఆస్వాదించే అలంకార ప్రియులకు నచ్చలేదు. వారిని ఆకర్షించే విధంగా కంటెంట్ ఉన్న వీడియోల కోసం విదేశీ వ్లాగ్‌లను చూసేదాన్ని. వాటిల్లో నాకు నచ్చిన కొన్నింటిని ఎంపిక చేసుకుని బ్యూటీ, మేకప్ టిప్స్‌తో కూడిన విషయాలు చెప్పే వీడియోలను ఇన్‌స్ట్రాగ్రాం, యూ ట్యూబ్‌లలో పోస్టు చేశా. దీంతో కొద్దికొద్దిగా నా వీడియో వ్యూయర్ షిప్ పెరిగింది. వందల సంఖ్యలో కూడా ఫాలోవర్లు లేని నా వీడియోలకు కొత్త టిప్స్‌తో చేసిన పోస్టులకు తక్కువ కాలంలోనే ఆ సంఖ్య 30 వేలకు చేరింది. ప్రస్తుతం అది 3లక్షల వరకు పెరిగింది. అయితే నాకన్నా ఎక్కువ వ్యూయర్ షిప్ ఉన్న కంటెంస్ట్‌లు ఉన్నా కొన్ని ప్రామాణికాల ఆధారంగా నాకు ఆదరణ లభించింది. ప్రతిష్ఠాత్మక ఫోర్బ్స్ డిజిటల్ స్టార్‌గా ఎంపికయ్యేలా చేసింది.

కుటుంబసభ్యుల సహకారంతో సాధిస్తా

ఎవరి ఉత్పత్తులు ప్రచారం కోసమో నేను కంటెంట్ వీడియోలను చేసే బదులు నేనే సొంతగా బ్రాండ్‌తో తయారు చేసే బ్యూటీ, ఫ్యాషన్ ఉత్పత్తుల కోసం ప్రచారకర్తగా ఎదగాలనేది నా ఆకాంక్ష. కుటుంబ సభ్యుల సహకారంతో నేననుకున్నది సాధించేందుకు ప్రయత్నిస్తా. మేకప్, బ్యూటీ ఉత్పత్తుల తయారీ కంపెనీ స్థాపించాలనేది నా కోరిక. కెమెరా ముందు నిలబడటం ఇష్టమే అయినా మోడల్‌గా కాని సినిమా రంగంలో అవకాశం వచ్చినా వెళ్లను.



టీటీడీ బోర్డు సభ్యుడిగా నర్సిరెడ్డి ప్రమాణ స్వీకారం



నన్నూరి నర్సిరెడ్డికి వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని టీటీడీ జేఈఓ వెంకయ్య చౌదరి

నల్లగొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) బోర్డు సభ్యుడిగా యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన నన్నూరి నర్సిరెడ్డి బుధవారం తిరుపతిలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం టీటీడీ జేఈవో వెంకయ్య చౌదరి వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. అంతకుముందు ఆయన కుటుంబ సభ్యులతో కలిసి వరాహ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నన్నూరి నర్సిరెడ్డి మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

దర్వేశిపురం ఆలయ ఆదాయం రూ. 13.82లక్షలు

కనగల్, నవంబరు 6: (ఆంధ్రజ్యోతి) నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. 87 రోజులకు గాను కానుకల రూపంలో రూ.13 లక్షల 82వేల 680లను భక్తులు సమర్పించారని ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ బి. సుమతి, ఈవో జయరామయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్లు జినుకుంట్ల చంద్రయ్యగౌడ్, నాగేశ్వర్‌రావు, జేఏలు ఉపేందర్‌రెడ్డి, రాజయ్య, మాజీ సర్పంచ్ సీహెచ్ వెంకట్‌రెడ్డి, మాజీ చైర్మన్ ముత్తయ్య, సీహెచ్. నగేష్‌గౌడ్ ఆలయ సిబ్బంది ఆంజనేయులు, రాజు, శ్రీకర్ తదితరులు ఉన్నారు.

సెమీఫైనల్స్‌కు నల్లగొండ జట్టు

● సంగారెడ్డి జిల్లాలో కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్

కొండాపూర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం సీ.హెచ్.కోనాపూర్‌లో అండర్-23 అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్ మూడో రోజు కొనసాగింది. స్థానిక ఎం.ఎ క్రికెట్ గ్రౌండ్‌లో తొలుత మెదక్ జిల్లా, కరీంనగర్ జిల్లా జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన కరీంనగర్ జట్టు 39.3 ఓవర్లలో 235 పరుగులకు ఆలౌట్ అయింది. తదుపరి మెదక్ జిల్లా జట్టు 36.2 ఓవర్లలో 240 పరుగులు చేసి విజయం సాధించింది. అనంతరం నిజామాబాద్ వర్సెస్ నల్లగొండ జిల్లా జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన నల్గొండ జట్టు 36.2 ఓవర్లలో 160 పరుగులు చేసి ఆలౌట్ అయింది. తర్వాత బ్యాటింగ్ చేసిన నిజామాబాద్ జట్టు 41 ఓవర్లలో 148 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది. దీంతో 12 పరుగుల తేడాతో నల్గొండ జిల్లా జట్టు విజయం సాధించి సెమీ ఫైనల్‌కు చేరింది. కాగా ఈ నెల 8 వ తేదీన నిజామాబాద్- ఆదిలాబాద్, రెండవ సెమీ ఫైనల్‌లో ఖమ్మం జిల్లా- నల్గొండ జిల్లా జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది.

ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం

చౌటుప్పల్ కమ్యూనిటీహెల్త్ సెంటర్‌లో వైద్య సేవల నిర్లక్ష్యంపై విచారణ



చౌటుప్పల్ కమ్యూనిటీహెల్త్ సెంటర్‌లో విచారణ నిర్వహిస్తున్న అధికారులు

చౌటుప్పల్ టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ కమ్యూనిటీహెల్త్ సెంటర్‌లో వైద్య సేవల నిర్లక్ష్యంపై జరిగిన ఘటనలపై చేపట్టిన విచారణ నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని ఉన్నతస్థాయి విచారణాధికారి డాక్టర్ సూర్యశ్రీరావు తెలిపారు. మెడికల్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర చైర్మన్ పగిడిపాటి సుధాకర్ చేసిన ఫిర్యాదు మేరకు బుధవారం చౌటుప్పల్ పట్టణంలోని సీహెచ్‌సీలో సూర్యశ్రీరావు విచారణ నిర్వహించారు. భారత సైన్యంలో విదులు నిర్వహించే సంస్థాన్ నారాయణపురం మండలానికి చెందిన మహిళా లక్ష్మి 2022 అక్టోబరు లో ప్రసవం కోసం సీహెచ్‌సీకి వెళితే వైద్య సేవలను అందించేందుకు నిరాకరించడంతో ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చింది. అదేవిధంగా చౌటుప్పల్ మండలానికి చెందిన మరో మహిళా సౌజన్య ప్రసవం కోసం సీహెచ్‌సీకి వెళితే వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం చేయడంతో గర్భస్థ శిశువు మృతిచెందింది. ఈ రెండు సంఘటనలకు బాధ్యులైన అప్పటి డ్యూటీ డాక్టర్‌గా ఉన్న సూపరింటెండెంట్ అలివేలుతో పాటు సిబ్బంది పై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు తెలంగాణ రాష్ట్ర మెడికల్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ పగిడిపాటి సుధాకర్ తగిన ఆధారాలతో పిర్యాదు చేశారు. సుధాకర్ పిర్యాదు మేరకు సూర్యశ్రీరావు సీహెచ్‌సీలో ప్రత్యేకంగా విచారణ నిర్వహించారు. ఫిర్యాదుదారుడు సుధాకర్,తో పాటు బాధితులు సౌజన్య, లక్ష్మి తండ్రి మల్లయ్య, ఆశా వర్కర్, డీసీహెచ్‌వో చిన్నానాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో యశోద, వైద్యులు అలివేలు, పాండు రంగం, వినోద్, నలుగురు స్టాఫ్ నర్సులను విచారించారు. వారు చెప్పిన విషయాలను నమోదు చేసుకున్నారు.

ఈ సందర్భంగా సూర్యశ్రీరావు విలేకరులతో మాట్లాడుతూ సుధాకర్ ఫిర్యాదును అనుసరించి రెండు సంఘటనలపై విచారణ నిర్వహించామని తెలిపారు. సమగ్రమైన నివేదికను రూపొందించి ప్రభుత్వానికి అందజేస్తామని, నివేదిక ఆధారంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ విచారణలో డీసీహెచ్‌వో చిన్నానాయక్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ కె. రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

● యాదాద్రిభువనగిరి జిల్లా మాదాపూర్‌లో మూడు రోజుల పాటు నిర్వహణ ● పాల్గొననున్న 360 మంది క్రీడాకారులు



మాధాపూర్‌లో కబడ్డీ పోటీలకు ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

తుర్కపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మాధాపూర్ గ్రామంలో ఈ నెల 7న గురువారం 9వ తేదీ వరకు 68వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సౌజన్యంతో మాధాపూర్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. వారం రోజుల క్రితమే ఎంఈవో మాలతి, పాఠశాల క్రీడల సమాఖ్య(ఎస్‌జీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బెజ్జం బాలకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటరెడ్డి, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కలిసి క్రీడల ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు. ఈ పోటీలకు తీన్మార్ మల్లన్న చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఎజీఎఫ్ సెక్రటరీ బాలకృష్ణ, క్రీడల ఆర్గనైజర్ చింతపండు వెంకటేశ్వర్లు, కన్వీనర్ లింగంపల్లి విజయ్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

కబడ్డీ పోటీల్లో 30జట్లు

అండర్- 17 బాలుర విభాగం, అండర్- 14 బాల, బాలికల విభాగాలకు చెందిన క్రీడాకారులకు కబడ్డీ పోటీలు నిర్వహిస్తారు. ఉమ్మడి పది జిల్లాల నుంచి అండర్- 17 బాలుర విభాగంలో పది జట్లు, అండర్- 14 బాల, బాలికల విభాగంలో 20 జట్లు పాల్గొంటాయని పీడీ వెంకటరెడ్డి తెలిపారు. మొత్తం 360 మంది క్రీడాకారులు పాల్గొంటారని, ఒక్కో టీంకు మేనేజర్, కోచ్ ఉంటారని తెలిపారు. ఈ క్రీడలు సజావుగా నిర్వహించేందుకు జిల్లా నుంచి 40 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొంటారు. పాఠశాల సమీపంలో నాలుగు కబడ్డీ కోర్టు(గ్రౌండ్)లు ఏర్పాటు చేశారు.

మట్టపల్లి వంతెనపై నీరు.. ప్రయాణికుల ఇబ్బందులు



మట్టపల్లి కృష్ణనదీ వంతెపై నిలిచిన వర్షపునీరు

మఠంపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయ సమీపంలోని కృష్ణానదిపై రూ.50 కోట్లతో ఏర్పాటు చేసిన హైలెవల్ వంతెనపై వర్షపునీరు నిలిచి ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉభయ రాష్ట్రాలను కలుపుతూ మట్టపల్లి వద్ద నిర్మించిన వంతెనపై రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అడుగు లోతు వర్షపు నీరు నిలిచి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగున్నరేళ్ల కిందట క్రితం ఈ వంతెన నిర్మించగా అప్పట్లో వర్షపు నీరు కృష్ణానదికి వెళ్లేలా అక్కడక్కడ పైపులు ఏర్పాటు చేశారు. వాహనాలు రద్దీ ఎక్కువగా ఉండటంతో దుమ్ము, మట్టితో ఇవి పూర్తిగా పూడిపోయి వంతెనపైనే నీరు నిలిచి ఉంటోంది. వాహనాలు వేగంగా వెళ్లే క్రమంలో పాదాచారుల కోసం ఏర్పాటుచేసిన కాలిబాటలో నడిచి వెళ్లేవారిపై ఈ మురుగు నీరు పడి దుస్తులు తడిసిపోతున్నాయి. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే వారికి ఇబ్బందులు తప్పడంలేదు. రోజుల తరబడి నీరు అలానే ఉంటుండటంతో సీసీ చేసిన వంతెనపై కంకరతేలి గుంతలు పడుతున్నాయి. నిరంతరం రాకపోకలు సాగించే లారీలు, బస్సులతో గుంతలు మరింతగా పెరిగాయి. సంబంధిత అధికారులు పైపుల్లో మట్టి తొలగించి నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, స్థానికులు తెలిపారు. ఏఈ శివకుమార్ మాట్లాడుతూ పైపుల్లో పేరుకుపోయిన మట్టి తొలగిస్తామని, నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

కారుమబ్బుల కనువిందు





సూర్యాపేట జిల్లా అర్వపల్లిలో ఆకాశంలో కారుమబ్బులు కనువిందు చేశాయి. వారం రోజులుగా వాతావరణంలో మార్పులతో మధ్యాహ్నం మబ్బులు తెల్లగా, సూర్యుడు అస్తమిస్తున్నప్పుడు నీలిరంగులో మారడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ● అర్వపల్లి (ఆంధ్రజ్యోతి)

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

భువనగిరి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు విద్యార్థులు చదువులో రాణించాలని 68వ ఇంటర్ ఎస్‌జీఎఫ్ పోటీల నిర్వహణ కమిటీ వైస్ చైర్మన్, ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ పాపిరెడ్డి అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న ఇంటర్ ఎస్‌జీఎఫ్ వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు బుధవారం ముగిశాయి.

వాలీబాల్ బాలుర విభాగంలో.. టీజీఎంఎస్, తుర్కపల్లి(ప్రథమ), హైదరాబాద్ జూనియర్ కళాశాల, బొమ్మలరామారం(ద్వితీయ), టీజీఎస్‌డబ్ల్యూ ఆర్‌జేసీ, రాజాపేట (తృతీయ) జట్లు బహుమతులు సాధించాయి.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఆలేరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని జేఎంజే పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. మేడ్చల్ జిల్లా కొంపల్లిలో ఈ నెల 8 నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి 68వ తెలంగాణ ఎస్‌జీఎఫ్ అండర్-14 పోటీల్లో విద్యార్థులు జయశ్రీ, నవ్యశ్రీ, తబాసుమ, వైష్ణవి, అనుశ్రీ, నిఖిల్ పాల్గొంటారని ప్రిన్సిపాల్ జయభార్గవి, పీడీ యాట సందీప్ తెలిపారు.

కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి..

ఆలేరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొలనుపాక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. 10వ తరగతి విద్యార్థి మనోజ్‌కుమార్ అండర్-17 విభాగంలో, 7వ తరగతి విద్యార్థి లింగాల ధనుష్ అండర్-14వ విభాగంలో ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు ఏ. వేణుగోపాల్ తెలిపారు. ఈ నెలలో బొమ్మలరామారం మండలంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను పీడీ ఎం. జోసెఫ్, ఉపాధ్యాయులు అభినందించారు.

చదరంగంతో మేధాశక్తి

చౌటుప్పల్ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): చదరంగం ఆటతో మేధాశక్తి పెరుగుతుందని ఎంఈవో గురువారావు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని కొయ్యలగూడెం జిలాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన 68వ జిల్లాస్థాయి అండర్-14, అండర్-17 విభాగాల చదరంగం పోటీలను బుధవారం ప్రారంభించారు. అండర్-14 విభాగంలో భువనగిరి మండలం అనంతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కోట సూర్య ప్రతాప్(ప్రథమ), రోహిత్(ద్వితీయ), భువనగిరి బాగాయత్ పాఠశాలకు చెందిన వివేకావర్ధన్ (తృతీయ) బహుమతులు సాధించారు. అండర్ -17 విభాగంలో భువనగిరి మండలం అనంతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రవికుమార్(ప్రథమ), వరుణ్‌కుమార్(ద్వితీయ), మనీష్ పాటిల్(తృతీయ) బహుమతులు సాధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గయ్య, మాజీ సర్పంచ్ మాచర్ల కృష్ణ, మాజీ ఎంపీటీసీ జిల్లా వెంకటేశ్, ఫిజికల్ డైరెక్టర్లు బిక్కు నాయక్, మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



కొప్పు శ్రీజ, దొంగరి వర్షిణి

శాలిగౌరారం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల మోడల్ స్కూల్ విద్యార్థినిలు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. జూనియర్ కాలేజీలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కొప్పు శ్రీజ, బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న దొంగరి వర్షిని ఎంపికయ్యారు. దొంగరి వర్షిని ఉత్తమ ప్రతిభ కనబరిచి అండర్ -19 నల్లగొండ హ్యాండ్‌బాల్ జట్టుకు కెప్టెన్‌గా ఎన్నికైందని మోడల్ స్కూల్ పీడీ బొడ్డు మల్లేష్ తెలిపారు. ఈనెల 7,8,9 తేదీలలో రంగారెడ్డిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ అభినందించారు.

నేరేడుగొమ్ము, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము ఆదర్శ పాఠశాల విద్యార్థులు అశ్విని, సన్ని, సబిత రాష్ట్రస్థాయి అండర్-19 హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 8, 9, 10వ తేదీల్లో రంగారెడ్డి జిల్లాలోని తుక్కుగూడలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ నేనావత్ లాలు తెలిపారు. విద్యార్థులను పీడీ శ్రీనునాయక్, ఉపాధ్యాయులు రాజలత, రేహనాబేగం, శిరీష, చందు, కోటేష్, గణేష్ అభినందించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు కన్నెకల్ విద్యార్థిని

మాడ్గులపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని కన్నెకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సింగం నందిని రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. ఈ నెల 5న కనగల్‌లో నిర్వహించిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 విభాగంలో ఉమ్మడి జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో నందిని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు నన్నూరి నాగిరెడ్డి తెలిపారు. ఈ నెల 8న సికింద్రాబాద్ వెస్లీ జూనియర్ కళాశాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

చిట్యాలరూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులోని కావేరి జిన్నిం గ్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డిలతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దళారుల మాటలు నమ్మి రైతులు నష్టపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందన్నారు. పత్తిలో 8 నుంచి 12శాతం వరకు తేమశాతం ఉండేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పత్తి విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పత్తి, వరి కొనుగోళ్లలో జరిగి చిన్నచిన్న తప్పిదాలు జరిగి ఉంటే దానిని బూతద్దంలో చూడొద్దని దీన్ని ఆసరాగా చేసుకుని ప్రభుత్వంపై బురదను చల్లొదన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు జరగకుండా ప్రత్యేకంగా అధికారులను నియమించి పర్యవేక్షించి అవసరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అదేవిధంగా ఆరెగూడెం శివారులో ప్రగతికాటన్ మిల్లులో ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. కార్య క్రమంలో చిట్యాల మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వెలిమినేడే పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, వైస్‌చైర్మన్ బొంతల అంజిరెడ్డి, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీవో జయలక్ష్మి, కావేరి, ప్రగతి కాటన్ జిన్నింగ్ మి ల్లుల యాజమాన్యం జిల్లా శ్రీనివాస్, కొమురవెళ్లి సంతోష్, ఉమాపతి, సీసీఐ అధికారి కృష్ణారావు, గుడిపాటి లక్ష్మీనర్సింహ, కందిమళ్ళ శిశుపాల్ రెడ్డి, కాటం వెంకటేశం, నీలకంఠం లింగస్వామి, నరేష్, గణేష్ ఉన్నారు.



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం, డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ అమిత్‌రెడ్డి

ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన బాట

» ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
» ట్రేడ్ యూనియన్ల పునరుద్ధరణకు పెరుగుతున్న డిమాండ్



నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్

నల్లగొండ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనంతో పాటు అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు దశలవారీ ఆందోళనకు సిద్ధమయ్యారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడానికి గెజిట్ విడుదల చేసింది. కానీ పలు సాంకేతిక కారణాలతో పాటు అదే సమయంలో సాధారణ ఎన్నికలు రావడం, ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఆర్టీసీ ఉద్యోగుల విలీన ప్రక్రియ ఫైల్ అటకెక్కింది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసినందున అపాయింట్‌డే ప్రకటించి జీవో విడుదల చేయాలని ఆర్టీసీ ఉద్యోగులు కోరుతున్నారు. అపాయింట్‌డే ప్రకటిస్తే వివిధ శాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే ఆర్టీసీ ఉద్యోగులకు కూడా అన్ని బెనిఫిట్స్ అంటే జీతభత్యాలు పెరుగుతాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని పెద్ద ఎత్తున ఆర్టీసీ ఉద్యోగులు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఒత్తిడి చేయడంతో కొంతమేరకు ఓ కొలిక్కి వచ్చినా ఆ తర్వాత పరిస్థితి ఎక్కడికక్కడే నిలిచిపోయింది. దీంతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆర్టీసీ కార్మికులు ఆశలు పెట్టుకున్నారు. సర్కార్ ఏర్పడి 11 నెలలు కావస్తున్నా ప్రభుత్వం తమ సమస్యలపై స్పందిచడం లేదని ఆర్టీసీ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో దశలవారీ ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు రెండు రోజుల క్రితం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 2023 సంవత్సరం నవంబరు మాసంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఇచ్చిన హామీలను అమలుచేయాలని కోరుతున్నారు. ఆందోళన కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులు, కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శనలు, సామూహిక నిరాహార దీక్షలు చేసినా ప్రభుత్వం స్పందించకపోవడంతో జేఏసీ దశల వారీ ఉద్యమాలు చేపడుతుంది.

9 సమస్యలపై కార్మికుల ఆందోళన

ఆర్టీసీ కార్మికులు ప్రధానంగా 9 రకాల సమస్యలపై ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడానికి గెజిట్ విడుదల అయినందున అపాయింట్‌డే ప్రకటించి జీవో విడుదల చేయాలని కోరుతున్నారు. 2021 వేతన సవరణ చేయడం 2017 వేతన సవరణ, ఏరియర్స్ ఇస్తూ అలవెన్స్‌లు పెంచాలని డిమాండ్ ఉంది. ఇకపోతే 10 సంవత్సరాలుగా ట్రేడ్ యూనియన్లు లేకపోవడంతో కార్మికుల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయడానికి వేదిక అంటూ లేకుండాపోయింది. గతంలో యూనియన్ల ఎన్నికలు ఉండటంతో పాటు గుర్తింపు ఉండేది. దీంతో ట్రేడ్ యూనియన్లు తిరిగి పునరుద్ధరించాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు కోరుతున్నారు. దీంతో ఉద్యోగుల్లో అభద్రతా కొరవడింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఆర్టీసీ రీజియన్ పరిధిలోని 7 డిపోల్లో గల అధికారులు, ఉద్యోగులంతా కలిసి 3 వేలకుపైగా ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రైవేట్ బస్సులు రద్దు చేస్తూ ఆర్టీసీకి కొత్త బస్సులు కొనుగోలు చేయాలని కోరుతున్నారు. ఇకపోతే మహాలక్ష్మి మహిళా ప్రయాణికులకు జీరో టికెట్ బదులు ఉచిత పాస్ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మహిళా ప్రయాణికుల నుంచి ఆధార్ కార్డు చూసి జీరో టికెట్ కొట్టడం కంటే ఉచిత పాస్ ఇస్తే మేలనే చర్చ సాగుతుంది. మహాలక్ష్మి పథకం విషయంలో ప్రభుత్వం ఆర్టీసీకి ప్రతి నెలా రాష్ట్ర స్థాయిలో రూ.350కోట్ల రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంలో సంస్థ మనుగడకు కష్టమవుతుంది. ఇక చనిపోయిన ఉద్యోగుల పిల్లలకు ఇచ్చే (బెడ్ విన్నర్ స్కీం)లో ఉద్యోగాలు రెగ్యులర్ ప్రాతిపదికన ఇవ్వాలని రిటైర్డ్ అయిన ఉద్యోగులకు 2017 వేతన సవరణ చేస్తూ పెండింగ్ బకాయిలు ఇవ్వాలని కోరుతున్నారు.

ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా..

ప్రభుత్వం ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలను మెరుగుపరచకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాత బస్సులు తరచుగా మరమ్మతులకు గురవుతున్నా వచ్చే బస్సులతోనే నడుపుతున్నారు. 84 ఎలక్ట్రికల్ బస్సులు త్వరలో మంజూరవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. మహాలక్ష్మి పథకం వల్ల పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు కిక్కిరిస్తూ నడుస్తున్నాయి. 10 నెలల కాలంలోనే దాదాపు 29 లక్షల మంది మహిళా ప్రయాణికులు రీజియన్ పరిధిలో ప్రయాణించారు. 7 డిపోల పరిధిలో సుమారు 750 బస్సుల వరకు ఉన్నాయి. ఇందులో కొన్ని అద్దె బస్సులను కూడా నడిపిస్తున్నారు. రోజు లక్షలాది కిలోమీటర్లు ప్రయాణించి దాదాపు 3 లక్షల మంది ప్రయాణికులను వారి గమ్యాలకు చేరవేయాల్సి ఉంటుంది. అయితే సరైన బస్సులు లేక గ్రామీణ ప్రాంతాలకు వెళ్లినప్పుడు మరమ్మతులకు గురైతే ప్రయాణికులతో పాటు డ్రైవర్ కండక్టర్ కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక రీజియన్‌లో పదవీ విరమణ పొందితే వారి స్థానంలో పోస్టులు భర్తీ కావడం లేదు. కొద్దిరోజుల క్రితం 70 మందిని కారుణ్య నియామకాల కింద కాంట్రాక్ట్ పద్ధతిన తీసుకున్నారు. అయితే ఇప్పటికే పోస్టుల ఖాళీలతో సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా డ్రైవర్ల కొరత తీవ్రంగా ఉండటంతో బస్సులను నడిపించడం సమస్యగా మారింది.

ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేయాలి



ప్రభుత్వం వెంటనే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలి. కార్మికులు, ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కార్యక్రమాలను దశలవారీగా చేపడతాం. ప్రభుత్వం ఏర్పడి 11 నెలలవుతున్నా ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదు. దీంతో ఆందోళన కార్యక్రమాలు చేపడతాం. తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర జేఏసీ నిర్ణయం మేరకు కార్యచరణ చేపడుతాం.

- ఎస్ఆర్‌సీ రాజు, రీజియన్ కార్యదర్శి, ఎంప్లాయిస్ యూనియన్

సమస్యలను పరిష్కరించాలి



అనేక సంవత్సరాలుగా కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలి. ఉద్యోగులకు సంపూర్ణ ఉద్యోగ భద్రతను కల్పించాలి. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరిస్తూ ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలి. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు వేతన సవరణ చేయడంతో పాటు పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలి. ప్రభుత్వం వెంటనే న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి ఉద్యోగులను, కార్మికులను ఆదుకోవాలి.

- కేఎస్ రెడ్డి, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్, రాష్ట్ర కార్యదర్శి

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.150	240	270
సూర్యాపేట	రూ.150	220	250
నల్లగొండ	రూ.150	220	250

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	586.20
టీఎంసీలు	301.3570
ఎడమకాల్వకు నీటి విడుదల	4,679
కుడికాల్వకు	9,767
విద్యుత్ కేంద్రం ద్వారా	24,888
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1,200 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	36,304 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	40,934 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	45.05 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	9,595 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	16,000క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	643.60 అడుగులు
టీఎంసీలు	4.10
ఎన్ని గేట్ల ద్వారా	1 గేటు
ఇన్‌ఫ్లో	588.76 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	738.37 క్యూసెక్కులు

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకుల మృతి

- కొండమల్లేపల్లిలో డివైడర్‌ను ఢీకొని విద్యార్థి
- వలిగొండలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడి దుర్మరణం

నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో బుధవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఇరువురు ద్విచక్ర వాహనాలు అదుపు తప్పడం వల్లే మృత్యువాత పడ్డారు.



కొండమల్లేపల్లి: ప్రమాదంలో మృతి చెందిన అజయ్‌కుమార్ (ఫైల్)

కొండమల్లేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): డివైడర్‌ను బైక్ ఢీకొనడంతో ఒక యువకుడు మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో మగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ రామ్మూర్తి, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... చందంపేట మండలంలోని గాగిళ్లాపురం గ్రామానికి చెందిన తిరుమల పర్వతాలు, పద్మ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆ గ్రామం నుంచి 15 సంవత్సరాల క్రితం కొండమల్లేపల్లికి వచ్చి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. కుమారుడు అజయ్‌కుమార్(20) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇదిలా ఉంటే అజయ్‌కుమార్ తల్లిదండ్రులకు తెలియకుండా మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి దేవరకొండకు చేరుకున్నాడు. దేవరకొండలో తన స్నేహితుడి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నాడు. అనంతరం మరో స్నేహితుడు కార్తీక్‌ను ద్విచక్రవాహనంపై తీసుకొని కొండమల్లేపల్లిలోని తన ఇంటికి మంగళవారం అర్ధరాత్రి 12.30 గంటలకు బయలుదేరాడు. మల్లేపల్లికి చేరుకున్న తర్వాత సాగర్ రోడ్డులో ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో అజయకుమార్ తలకు బలమైన గాయమవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలపాలైన కార్తీక్‌ను చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో కుటుంబీకుల రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. మృతుడి తండ్రి పర్వతాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు. మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న యాజమాన్యం కళాశాల సెలవు ప్రకటించింది. దీంతో కళాశాలకు చెందిన సుమారు 150మంది విద్యార్థులు అంత్యక్రియలకు హాజరయ్యారు. కలివిడిగా ఉండే స్నేహితుడిని కోల్పోవడంతో వారంతా కన్నీటిపర్యంతమయ్యారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి....

వలిగొండ: ప్రమాదవశాత్తూ బైక్ అదుపు తప్పి కిందపడి గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్ తలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అరూరు గ్రామానికి చెందిన సారగండ్ల నవీన్‌కుమార్ (27) చౌటుప్పల్ మండలం లింగోటం గ్రామ పరిధిలో ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం విధులు ముగించుకొని స్వగ్రామానికి వస్తుండగా అరూరు గ్రామ సమీపం వద్ద బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ మార్గంలో వెళ్తున్న కొందరు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని సోదరుడు ప్రవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పత్తి విక్రయించేందుకు ఇన్ని కొర్రీలా?

- తేమ పేరుతో ఇబ్బందులు పెట్టొద్దు
- 18 ట్రాక్టర్లకు మూడింటికే అనుమతి
- నల్లగొండ జిల్లా చండూరు మండలంలో రైతుల ధర్నా



బంగారిగడ్డ గ్రామంలోని మంజిత్ పత్తి మిల్లు ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

చండూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తేమ పేరుతో పత్తి కొనుగోలు చేయకుండా సీసీఐ నిర్వాహకులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం ఈ మేరకు నల్లగొండ జిల్లా చండూరు మండలం బంగారిగడ్డ గ్రామంలోని మంజిత్ పత్తి మిల్లు ఎదుట ధర్నా చేశారు. గ్రామంలో 10 రోజుల క్రితం సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేసినా బుధవారం నుంచే కొనుగోళ్లు ప్రారంభించారు. దీంతో మండలంలోని 18మంది రైతులు ట్రాక్టర్లలో పత్తిని సీసీఐ కేంద్రానికి తీసుకువచ్చారు. సీసీఐ అధికారులు తేమ శాతాన్ని పరిశీలించి మూడు ట్రాక్టర్లను అనుమతించి 18శాతం ఉన్న 15 లోడు ట్రాక్టర్లను తిరస్కరించారు. 12 శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేస్తామని సీసీఐ అధికారులు చెప్పటంతో రైతులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించడానికి ఇన్ని కొర్రీలా అని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఐ కేంద్రాల నిర్వాహకుల వల్ల దళారులకే విక్రయించాల్సి పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి వద్ద తేమ శాతాన్ని ఎలా చూడగలరని ప్రశ్నించారు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే తిరస్కరించడం సమంజసం కాదన్నారు. తేమ శాతాన్ని బట్టి మద్దతు ధర కాకుండా తక్కువ ధరకైనా కొనుగోలు చేయాలని రైతులు వేడుకున్నా కొనుగోలు చేయలేదన్నారు. సాయంత్రం 3 గంటల నుంచి రెండు గంటల పాటు ఆందోళన చేయటంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిర్వాహకులతో మాట్లాడారు. 15 ట్రాక్టర్లలో ఉన్న సుమారు 30 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయాలని సూచించినా అందుకు వారు అంగీకరించకపోవడంతో పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. రైతులు చేసేదేమీలేక మిల్లు వద్దే ఉండిపోయారు. అధికారులు తక్షణమే స్పందించి పత్తిని కొనుగోలు చేయాలని రైతులు వేడుకున్నారు. ఆందోళన కార్యక్రమం లో రైతులు దోమల రామచంద్రం, శివకుమార్, బొల్లం వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

తిప్పర్తిలో దిగుమతి చేయని ధాన్యం

తిప్పర్తి: తిప్పర్తి మండల పరిధిలోని అనిశెట్టి దుప్పలపల్లి వద్ద ఉన్న శ్రీ సాయి వెంకటేశ్వర రైస్‌మిల్లు నిర్వాహకులు ధాన్యం దిగుమతి చేసుకోలేదు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కొనుగోలు కేంద్రాల నుంచి నాలుగు లారీలు ఒక్కో లారీలో 120 బస్తాలకు పైగా లోడ్ చేసుకొని నల్లగొండ పరిధిలోని ఆర్జాలబావి గోదాంకి వెళ్లాయి. ఆ రోజు రాత్రి కురిసిన భారీ వర్షానికి టార్పాలిన్లు కప్పినా కొన్ని బస్తాలు తడిశాయి. గోదాం నిర్వాహకులు తడిసిన ధాన్యం నిల్వ చేయడం కుదరదని శ్రీ సాయి వెంకటేశ్వర రైస్‌మిల్లుకు పంపించారు. నాలుగు లారీలు మిల్లుకు చేరుకొని రెండు రోజులు గడిచినా మిల్లు నిర్వాహకులు ధాన్యం దిగుమతి చేసుకోలేదు.

శుభకార్యం జరగాల్సిన ఇంట విషాదం

- కుమారుడి నిశ్చితార్థం రోజే తండ్రి మృతి



అంజన్‌రావు (ఫైల్ ఫొటో)

మర్రిగూడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శుభకార్యం జరిగే ఇంట విషాదం నెలకొంది. తెల్లవారితే కుమారుడి నిశ్చితార్థం చేసేందుకు ఏర్పాట్లలో నిమగ్నంకాగా, తండ్రి గుండెపోటుతో మృతిచెందారు. బుధవారం నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. మర్రిగూడ మండల కేంద్రానికి చెందిన ప్రైవేటు ఆయుర్వేదిక్ వైద్యుడు పొనుగోటి అంజన్‌రావు (63) కుమారుడికి బుధవారం వరంగల్‌లో నిశ్చితార్థం జరగాల్సి ఉంది. దీంతో దూర ప్రాంతంలో ఉన్న బంధుమిత్రులందరూ రెండు రోజుల ముందుగానే ఇంటికి చేరుకున్నారు. వరంగల్ వెళ్లేందుకు బుధవారం తెల్లవారుజామున కుటుంబసభ్యులు, బంధువులు సిద్ధమవుతుండగా, అంజన్‌రావు ఒక్కసారిగా కుప్పకూలాడు. కుటుంబసభ్యులు 108కు సమాచారమివ్వగా అప్పటికే మృతి చెందినట్లు సిబ్బంది నిర్ధారించారు. అప్పటివరకు అందరినీ అప్రమత్తం చేస్తూ సందడి చేసిన అంజన్‌రావు మృతి చెందడంతో బంధుమిత్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అంజన్‌రావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. శుభకార్యం జరగాల్సిన ఇంట్లో విషాదం నెలకొనగా, బుధవారం మధ్యాహ్నం అంజన్‌రావుకు అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

చిలుకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని కొండాపురం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... కొండూరు గ్రామానికి చెందిన యరమల్ల నాగరాజు (41) గ్రామంలో శుభకార్యాలకు, పండుగలకు మైక్ సెట్లు, లైటింగ్‌లు ఏర్పాటు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామంలో మంగళవారం జరిగిన నాగులచవితి పండుగ సందర్భంగా దేవాలయం వద్ద లైటింగ్, మైక్ సెట్లు ఏర్పాటు చేశాడు. బుధవారం వాటిని తొలగించేందుకు వెళ్లాడు. ఇనుప నిచ్చెనతో దేవాలయం పైకి ఎక్కి లైట్లు తొలగిస్తుండగా, ఇనుప నిచ్చెన పక్కనే ఉన్న 11కేవీ వైర్లు తగలడంతో విద్యుదాఘాతానికి గురైయ్యాడు. గమనించి కుమారుడు నాగరాజును చికిత్స నిమిత్తం కోదాడ వైద్యశాలకు తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు నాగరాజు భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాంబాబు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బస్టాండ్‌లో గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

భువనగిరి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి బస్టాండులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ కె. సురేష్‌కుమార్ బుధవారం తెలిపారు. బస్టాండ్ ఆవరణలో ఉన్న మృతదేహాన్ని గుర్తించిన బస్టాండ్ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతుడికి సుమారు 45సంవత్సరాలు ఉంటాడని, ఆరెంజ్ టీషర్ట్, నీలిరంగు పాయింట్ ఉందని, మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలో భద్రపరిచినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పట్టణ ఏఎస్‌ఐ శ్రీనివాస్ నెంబర్ 8712577179, పోలీస్‌స్టేషన్ సెల్ 8712662803కు సంప్రదించాలని సూచించారు.

ఏడాది లక్ష్యం మూడు నెలల్లో పూర్తి

» లక్ష్యాన్ని అధిగమించిన ఎడమకాల్వ జలవిద్యుత్ కేంద్రం
» లక్ష్యం 69 మిలియన్ యూనిట్లు
» 3నెలల్లో 73.32 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి



సాగర్ ఎడమకాల్వ జలవిద్యుత్ కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న సీఈ మంగేష్‌కుమార్, ఉద్యోగులు


నాగార్జునసాగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ఎడమకాల్వ జలవిద్యుత్ కేంద్రంలో ఏడాది లక్ష్యాన్ని మూడు నెలల్లో అధిగమించి విద్యుదుత్పత్తి చేశారు. గత ఏడాది కృష్ణా పరివాహక ప్రాంతంలో సరిపడా వర్షాలు లేక సాగర్‌కు వరద రాక లేదు. దీంతో సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంతో పాటు, ఎడమకాల్వ జలవిద్యుత్ కేంద్రంలోనూ విద్యుదుత్పత్తి చేయలేదు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణం అనంతరం 1991లో ఎడమకాల్వ వద్ద 30 మెగావాట్ల సామర్థ్యంతో రెండు టర్బైన్లతో (మొత్తం 60 మెగావాట్లు) జల విద్యుత్ కేంద్రాన్ని నిర్మించారు. నాటి నుంచి ప్రతి సంవత్సరం ఎడమ కాల్వ జల విద్యుత్ కేంద్రంలో వరద రాకను బట్టి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. 2023 - 24 సంవత్సరంలో సాగర్ జలాశయంలోకి వరద రాకపోవడంతో ఎడమకాల్వ విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేయలేదు. ఈ ఏడాది జూలై 29వ తేదీ నుంచి సాగర్ జలాశయానికి వరద రాక మొదలైంది. దీంతో ఆగస్టు 6వ తేదీ నుంచి ఎడమకాల్వ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తిని జెన్‌కో అధికారులు ప్రాంభించారు. ఈ ఏడాది లక్ష్యం 69 మిలియన్ యూనిట్లు కాగా అక్టోబరు 31వ తేదీ రాత్రి 11గంటలకే లక్ష్యాన్ని చేరుకున్నారు. నవంబరు 5వ తేదీ నాటికి 73.32 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేసి ఏడాది లక్ష్యాన్ని మూడు నెలల కాలంలోనే అధిగమించినట్లు జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎడమకాల్వ జలవిద్యుత్ కేంద్రం వద్ద సీఈ మంగేష్‌కుమార్ ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేశారు. ఉద్యోగులకు, ఇంజనీర్లకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్ మాట్లాడుతూ జెన్‌కో ఉద్యోగులు, ఇంజనీర్లు అందరి సమష్టి కృషితోనే ప్రధాన జలవిద్యుత్ కేంద్రం, ఎడమకాల్వ జలవిద్యుత్ కేంద్రాల్లో ఈ ఏడాది లక్ష్యాన్ని మూడు నెలల్లోనే అధిగమించామన్నారు.

సాగర్‌లో విద్యుదుత్పత్తి ఉదయం నిలిపివేత.. సాయంత్రం ప్రారంభం

కృష్ణానదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) ఆదేశాల మేరకు నాగార్జునసాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో బుధవారం ఉదయం విద్యుదుత్పత్తిని నిలిపివేసిన అధికారులు సాయంత్రం ప్రారంభించారు. ప్రాజెక్టు పరిధిలోని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రెండు పంటలకు సాగునీటితో పాటు తాగు నీటికి కూడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, విద్యుదుత్పత్తిని నిలిపివేయాలని రెండు రాష్ట్రాల నీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలకు కేఆర్ఎంబీ మంగళవారం లేఖలు పంపింది. సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో నీటిని వృథా చేయవద్దని, అనవసరంగా విద్యుదుత్పత్తి చేస్తూ ఉన్న నీటిని ఖాళీ చేయవద్దని కేఆర్ఎంబీ లేఖల్లో పేర్కొంది. నీటిపారుదల శాఖ అధికారుల సూచన మేరకు బుధవారం ఉదయం 10 గంటలకు సాగర్ ప్రధాన జలవిద్యుత్, ఎడమకాల్వ జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తిని నిలిపివేసినట్లు జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్ తెలిపారు. సాగర్ జలాశయంలో 580 అడుగుల నీటిమట్టం వరకు ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తిని చేపట్టే వెసులుబాటు ఉండటంతో జెన్‌కో అధికారుల ఆదేశాల మేరకు సాయంత్రం 4గంటలకు ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తిని ప్రారంభించినట్లు సీఈ తెలిపారు.

సెల్‌ఫోన్ రికవరీలో నల్లగొండ టాప్

- డీజీపీ నుంచి అవార్డు అందుకున్న టూటౌన్ ఎస్‌ఐ నాగరాజు



డీజీపీ జితేందర్ నుంచి అవార్డు తీసుకుంటున్న టూటౌన్ ఎస్‌ఐ రావుల నాగరాజు

నల్లగొండ క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో సెల్‌ఫోన్ పోయిన ఫిర్యాదులను పరిష్కరించడంలో నల్లగొండ పట్టణం ప్రథమ స్థానంలో నిలిచింది. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో డీజీపీ జితేందర్ నల్లగొండ టూటౌన్ ఎస్‌ఐ రావుల నాగరాజుకు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా డీజీపీ ఎస్‌ఐ నాగరాజుతో పాటు రికవరీ చేసిన పోలీస్ సిబ్బందిని అభినందించారు.

26 ఫోన్ల రికవరీ


జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 26 ఫోన్లను రికవరీ చేశారు. బుధవారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ శివరాంరెడ్డి మాట్లాడుతూ మొబైల్ మిస్సింగ్ కేసులోయల సీఈఐఆర్ పోర్టల్ ద్వారా నెల రోజుల వ్యవధిలోనే ఫోన్లను రికవరీ చేస్తున్నట్లు తెలిపారు. నల్లగొండ వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది కిరణ్, ఫరూక్ సహకారంతో ఫోన్‌లను రికవరీ చేసి వారికి అందజేసినట్లు తెలిపారు. ప్రజలు ఎవరైనా తమరి సెల్‌ఫోన్ పోతే వెంటనే ఆ మొబైల్‌లో ఉన్న సిమ్ బ్లాక్‌చేసి సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సైదులు, సిబ్బంది ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు వివరాల ప్రకారం... అంగడిపేట ఎక్స్‌రోడ్డుకు చెందిన కొడావత్ రాజు, బుజ్జమ్మ కరెంట్ సబ్‌స్టేషన్ వెనుక వైపు నిర్మాణంలో ఉన్న షట్టర్‌లో రొట్టెలు, చికెన్ వండుతూ జీవనం కొనసాగిస్తారు. రోజూ మాదిరిగానే మంగళవారం రాత్రి 10గంటకు పనులు ముగించుకుని ఇంటికి వెళ్లారు. ఇంటికి వెళ్లి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా రెండు బీరువాలు పగులగొట్టి అందులో ఉన్న రూ.92వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించారు. వారు వెంటనే గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా బుధవారం నల్లగొండ క్లూస్‌టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు. వేలిముద్రల ఆధారంగా దర్యాప్తు చేపట్టి దొంగలను త్వరలోనే పట్టుకుంటామని ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.

- ఆత్మకూర్(ఎస్): సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం పరిధిలోని ఏపూరు గ్రామంలో చింతరెడ్డి వీరారెడ్డి నివాసంలో బుధవారం పట్టపగలు చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... చింతరెడ్డి వీరారెడ్డి కుటుంబసభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లగా మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి 3 తులాల బంగారం, 20తులాల వెండి, రూ.10వేల నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. వ్యవసాయ క్షేత్రం నుంచి సాయంత్రం ఇంటికొచ్చిన వీరారెడ్డి దంపతులకు ఇంట్లో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో తల్లి, సోదరుడిపై దాడి



గాయపడిన సైదమ్మ

మేళ్లచెర్వు, నవంబరు 6: కుటుంబ కలహాలతో తల్లి, సోదరుడిపై దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల పరిధిలోని వెల్లటూరు ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో బుధవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వెల్లటూరుకు చెందిన రౌతు సైదమ్మకు ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు నాగరాజు ఇంట్లో సైదమ్మ ఉంటుంది. బుధవారం మధ్యాహ్నం సైదమ్మ పెద్దకుమారుడు సువర్ణరాజు అతని భార్య శ్రీలత ఒక్కసారిగా కర్రలు, రాళ్లతో నాగరాజు ఇంటిపై దాడి చేశారు. దీంతో తల్లి సైదమ్మ, సోదరుడు నాగరాజుకు తీవ్రగాయాలయ్యాయి. వారిని స్థానికులు చికిత్స నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించినట్లు పోలీసులు తెలిపారు. రౌతు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పరమేష్ తెలిపారు.

80 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

మఠంపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న ప్రజా పంపిణీ బియ్యం (పీడీఎస్)ను సూర్యాపేట జిల్లా మఠంపల్లి పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలో వివిధ ప్రాంతాలు, గ్రామాలు, తండాల నుంచి పీడీఎస్ బియ్యాన్ని సేకరించారు. మండల కేంద్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పెదవీడు గ్రామం నిర్వహించిన వాహనాల తనిఖీలో పట్టుబడినట్లు తెలిపారు. 3 బొలెరో వాహనాల్లో 80 క్వింటాల రేషన్ బియ్యంతో పాటు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అక్రమంగా బియ్యం, గుట్కా తరలిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

కేటీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నేతలు



కేటీఆర్‌ను కలిసిన ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ ఎమ్మెల్యేలు

నల్లగొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను బుధవారం హైదరాబాద్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు మర్యాద పూర్వకంగా కలిశారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్ర కుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిషోర్ కుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, నల్లగొండ మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి ఉన్నారు.

కొనుగోలు కేంద్రంలో పత్తి విక్రయించాలి



చిట్యాలలో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి, చిట్యాల నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతుల పత్తిని సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. నార్కట్‌పల్లి మండలం చౌడంపల్లిలోని వరలక్ష్మీ కాటన్ మిల్లులో, చిట్యాల శ్రీకృష్ణ కాటన్ మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో రైస్ మిల్లుల యజమానులతో కుమ్మక్కై బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు ధనార్జనే ధ్యేయంగా పనిచేసి రైతులను మోసం చేశారని ఆరోపించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బత్తుల ఊశయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, బండా సాగర్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, సట్టు సత్తయ్య, వరలక్ష్మీ కాటన్ మిల్లు యజమాని కల్పనాశ్రీధర్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ ఛాయాదేవి, చిట్యాలలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకటరెడ్డి, బీఆర్ ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి, కృష్ణ, దేవదాస్, పాల్గొన్నారు.

తూకంలో తేడా లేకుండా పత్తి కొనుగోలు చేయాలి



సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సామేల్

శాలిగౌరారం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకవచ్చిన పత్తిని తూకంలో ఎలాంటి తేడా లేకుండా కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శాలిగౌరారం మండలం మాదారంలోని టీఆర్‌ఆర్ కాటన్ మిల్‌లో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించి కనీస మద్దతు ధర రూ.7,521 పొందాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ఛాయదేవి, తహసీల్దార్ పి.యాదగిరి, ఎంపీడీవో గార్లపాటి జ్యోతి లక్ష్మి, సింగిల్ విండో చైర్మన్ తాళ్లూరి మురళీ, మార్కెట్ కార్యదర్శి చీనా నాయక్, సీసీఐ సీపీఓ రాజు, ఇన్‌చార్జి రాజశేఖర్, కాటన్‌మిల్ యజమాని తానం జోజిరెడ్డి, సుధాకర్, జనార్దన్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

నాగార్జునసాగర్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బీసీ గురుకులాల ఆర్‌సీవో సంధ్యారాణి విద్యార్థులకు సూచించారు. బుధవారం ఆమె సాగర్ హిల్‌కాలనీలో బీసీ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె డిగ్రీ, జూనియర్ కళాశాలల, పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం పాఠశాల, కళాశాలల రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. తరగతి గదులు, వంటశాల, హాస్టల్ గదులను పరిశీలించారు. పాఠశాల, కళాశాలల్లో అందుతున్న వసతులపై సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏటీపీ గాయత్రి ఉన్నారు.

23న మాలల ఆత్మీయ సమ్మేళనం

నల్లగొండ రూరల్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 23న మాలల, మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని జిల్లా కేంద్రంలోని ఎస్ఎల్ బీసీ రోడ్డులోని జూలకంటి ఇంద్రారెడ్డి ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్నట్లు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నల్లగొండ జిల్లా చైర్మన్ లకుమాల మధుబాబు తెలిపారు. ఆ సంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమ్మేళనానికి ముఖ్య అతిథిగా చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా కో చైర్మన్లు చింతపల్లి బాల కృష్ణ, అద్దంకి రవీందర్, సంద యాదగిరి, ఎస్ఐ లింగం, పిచ్చయ్య, అనిల్, పురం వేణుపాల్గొన్నారు.

షరతులు లేకుండా బోనస్ చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా సన్న ధాన్యానికి రూ.500 బోనస్‌ను ఎలాంటి షరతులు లేకుండా అందజేయాలని రైతబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సన్న ధాన్యాన్ని రైతులు కేవలం మిల్లుల వద్దనే అమ్మే అవకాశం ఉందని, ప్రభుత్వం ఐకేపీ కేంద్రాలను మార్కెట్‌లో అమ్మినవారికే బోనస్ ఇస్తామని మెలిక పెట్టడం రైతులను మోసగించడమేనన్నారు. రైతు భరోసా రూ.7,500 ఎకరానికి ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం వానాకాలం సీజన్ ముగిసిపోతున్న ఇంతవరకు ఇవ్వకపోవడం విచారకరమన్నారు. రైతులు సగటున ఎకరానికి 30 క్వింటాళ్ల ధాన్యం పండిస్తున్నారని, దీనికి బోనస్ రూ.15వేలు ఇవ్వాల్సి ఉంటుందని, రైతు భరోసా ఇవ్వలేని ప్రభుత్వం బోనస్ ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. రైతులంతా పార్టీలకతీతంగా ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వాన్ని నిలదీసి తమకు న్యాయం జరిగేంత వరకు ఉద్యమించాలన్నారు. వానాకాలంలో పండించిన సన్న రకం ధాన్యం మొత్తానికి ప్రభుత్వం మద్దతు ధర రూ.2,310, బోనస్ రూ.500తో కలిపి రూ.2810 చెల్లించాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ 46శాతం మందికి కూడా కాలేదని మిగిలిన రైతులందరికి రుణమాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మట్టపల్లి సైదులుయాదవ్, మార్కెట్ డైరెక్టర్ జగదీష్, మాజీ సర్పంచ్ రవీందర్ పాల్గొన్నారు.

అమల్లోకి కొత్త పాలసీ

(5వ పేజీ తరువాయి)

ప్రకటించారు. అయితే మిల్లర్లు ఈ సీజన్‌లో ధాన్యం సీఎంఆర్‌కు అంగీకరించి ప్రభుత్వానికి అంగీకారం తెలిపినప్పటికీ సీఎంఆర్ బియ్యం పర్సంటేజీ తగ్గించాలనే డిమాండ్‌ని కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ సీజన్‌లోనూ దాదాపు ఆరులక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్ నిమిత్తం జిల్లాలో మిల్లులకు ఇచ్చే పరిస్థితి ఉండడంతో ఆమేరకు మిల్లర్లు సంసిద్ధత వ్యక్తం చేశారు.

నల్లగొండ జిల్లాలో రబీలోనూ 75శాతం పూర్తయిన సీఎంఆర్

నల్లగొండ జిల్లాలో గత వానాకాలంలో ఇచ్చిన సీఎంఆర్ కోటా బియ్యం 99శాతం వరకు బియ్యం సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌కు చేరింది. వానాకాలంలో 3,22,754 మెట్రిక్ టన్నుల ధాన్యం 245 మిల్లులకు కేటాయించగా, ఇందుకు 2,17,577 మెట్రిక్‌టన్నుల బియ్యం తిరిగి రావాల్సి ఉంది. ఇందులో ఇప్పటివరకు 2,03,744 మెట్రిక్ టన్నుల బియ్యం వచ్చింది. ఇంకా 13,832 టన్నుల బియ్యం రావాల్సి ఉంది. రబీలో జిల్లాలో 3,26,021 మెట్రిక్‌టన్నుల ధాన్యం ఇవ్వగా, ఇందుకుగాను 2,21,569 టన్నుల బియ్యం రావాల్సి ఉండగా, ఇప్పటివరకు 1,43,906 టన్నుల బియ్యం వచ్చిచేరింది. ఇంకా దాదాపు 77,663 మెట్రిక్‌టన్నుల బియ్యం మిల్లర్ల నుంచి రావాల్సి ఉంది. ఇతర జిల్లాలతో పోల్చుకుంటే నల్లగొండ జిల్లాలో సీఎంఆర్ బియ్యం వెనక్కి రావడంలో చాలా ముందుజలో ఉందని, ఈసీజన్‌లోనూ ఇదే తరహాలో మిల్లింగ్ సాగేలా చూడాలని తాజా సమీక్షలో పౌరసరఫరాలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్ చౌహాన్ జిల్లా అధికారులకు సూచించారు.

ఇబ్బంది కలిగించవద్దనే అంగీకరించాం



మిల్లర్లు, సివిల్ సప్లయి కార్పొరేషన్ నడుమ రైతులు ఇబ్బంది పడవద్దనే ఉద్దేశంతో కలెక్టర్ సూచనల మేరకు సీఎంఆర్ కింద ధాన్యం దిగుమతి చేసుకుంటున్నాం. సోమవారం నుంచి ఈ ప్రక్రియ జిల్లాలో మొదలైంది. గత వానాకాలం, యాసంగిలో సీఎంఆర్ బియ్యం ఇవ్వడంలో జిల్లా రాష్ట్రంలోనే ముందంజలోనే ఉండడమే ఇక్కడ మిల్లర్ల పారదర్శకతకు నిదర్శనం. సన్నాలకు బియ్యం పర్సంటేజీ తగ్గించాలని కోరుతున్నాం. టెస్ట్‌మిల్లింగ్ చేసి పర్సంటేజీ నిర్ణయించాలి. పెండింగ్ బిల్లులు చెల్లిస్తే, తక్షణమే బ్యాంకు గ్యారెంటీలు కూడా అందజేస్తాం. రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూస్తాం. మిల్లర్లు ఎదుర్కొనే సమస్యలను కూడా సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు కమిషనర్ అంగీకరించినందుకు కృతజ్ఞతలు.

కర్నాటి నారాయణ,
నల్లగొండ జిల్లా రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షుడు

డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద వసతులు కల్పిస్తాం

● ఎమ్మెల్యే బాలూనాయక్



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలూనాయక్

దేవరకొండ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద లబ్ధిదారులకు విద్యుత్, తాగు నీరు, డ్రైనేజీతోపాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూ నాయక్ అన్నారు. దేవరకొండ పట్టణశివారు పెంచికల్‌పహాడ్ డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ అధికారులతో బుధవారం కలిసి సందర్శించారు. విద్యుత్ మీటర్లకు కనెక్షన్లు, పైప్‌లైన్లు వేసి కృష్ణాజలాల సరఫరా చేయాలని, పరిష్కరించాలని, వీధిలైట్లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

● దేవరకొండ అయ్యప్పస్వామి ఆలయంలో ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ పూజలు చేశారు. అనంతరం అయ్యప్పస్వాములకు అన్నప్రసాద ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, పీడీ రాజ్‌కుమార్, విద్యుత్ డీఈ విద్యాసాగర్, ఈఈ హుస్సేన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నగేష్, మున్సిపల్ ఏఈ రాజు, పీఆర్‌ఏఈ శంకర్, నాయిని మాధవరెడ్డి, జాన్‌యాదవ్, జాల నర్సింహారెడ్డి, వడ్త్యా దేవేందర్ నాయక్, అయ్యప్ప గురుస్వామి చంద్రమౌళిస్వామి, నాగేశ్వరస్వామి, శ్రీనుస్వామి పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలం



అధ్యక్షుడిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

పెద్దఅడిశర్లపల్లి, నవంబర్ 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్థానిక ఎన్నికలలో సత్తాచాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వల్లపురెడ్డి, ముత్యాపురావు, అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, మహేందర్, దామోదర్, సధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

సబ్ స్టేషన్‌కు తాళం వేసి గ్రామస్థునిరసన



సబ్‌స్టేషన్‌కు తాళం వేస్తున్న గ్రామస్థులు

మాడ్గులపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతో తమ ఇండ్లలో విద్యుత్ పరికరాలు కాలిపోయాయని ఆరోపిస్తూ మండల కేంద్రంలో గ్రామస్తులు బుధవారం విద్యుత్ సబ్‌స్టేషన్ తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్ నుంచి వెళ్లే విద్యుత్ లైన్‌లో అధిక లోడ్ వల్ల తమ ఇండ్లలోని ఫ్రిజ్‌లు, టీవీలు, ఫ్యాన్లు కాలిపోయాయన్నారు. విద్యుత్ అధికారులను సంప్రదిస్తే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా చూస్తామని గ్రామస్తులకు సర్ధిచెప్పడంతో ఆందోళన విరమించారు.

తాళ్లవెల్లంలలో అంగడి ప్రారంభం

చిట్యాలరూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లవెల్లంల గ్రామంలో అంగడిని మాజీ సర్పంచ్ జనగాం రవీందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ వడ్డెపల్లి లక్ష్మయ్య బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పజ్జూరి అజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



సాగర్‌లో చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

తిరుమలగిరి(సాగర్),పెద్దవూర నవంబరు6(ఆంధ్రజ్యోతి):రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించి ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. తిరుమలగిరి (సాగర్) వ్యవసాయ సబ్ మార్కెట్‌యార్డు, పెద్దవూరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధ వారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం తిరుమలగిరి (సాగర్) మండలం అల్వాల గ్రామంలో పార్వతీ పరమేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దవూర మండలం శిరసనగండ్ల గ్రామ చెరువులో చేప పిల్లలను వదిలారు

చేపపిల్లల వదిలివేత

నాగార్జునసాగర్,నవంబరు06(ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖ ఆధ్వర్యంలో సాగర్ జలాశయంలో ఉచిత చేప పిల్లలను విడుదల కార్యక్రమానికి ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి చరితరెడ్డి మాట్లాడుతూ రూ. 20 లక్షల విలువ చేసే 13 లోల 72 వేల చేపపిల్లలను జలాశయంలో వదిలామన్నారు. వీటిలో 40 శాతం రోహూ, కట్లచేప 50 శాతం, మిగిలిన పది శాతం మిరుగాల చేపలను వదిలినట్లు చెప్పారు. కార్యక్రమాల్లో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, కృష్ణారెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ శేఖర్‌రెడ్డి, రంగారెడ్డి, ఉంగరాల శ్రీను, రమావత్ కృష్ణనాయక్, లాలునాయక్, మెగావత్ మునినాయక్, శాగం శ్రావణ్ కుమార్‌రెడ్డి మత్స్యశాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ప్రసాద్, రవి, కిశోర్, రమణ పాల్గొన్నారు.

వరికోతల సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి : ఏవో

డిండి, నవంబరు6(ఆంధ్రజ్యోతి): వరికోత యంత్రంతో కోతలు చేపట్టినప్పుడు రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏవో రామలింగేశ్వరరావు బుధవారం తెలిపారు. వరిపైరు పూర్తిగా పక్వానికి వచ్చినప్పుడు మాత్రమే యంత్రంతో కోతలు మొదలుపెడితే తాలూ లేకుండా ఉంటుందని తెలిపారు. కోత మిషన్ ఉపయోగించే సమయంలో లోయర్ ఆన్‌లో ఉండాలని, కోత మిషన్ ఆర్పీఎం 19 నుంచి 20కిపైగా ఉండాలని, గేర్ స్కోట్ ఏ 2 నుంచి బీ 1లో పెట్టి కోత కొనసాగించాలని సూచించారు. సూచనలు పాటించడం ద్వారా తాలూ, మట్టిపెల్లలు, గడ్డి రాకుండా నాణ్యమైన ధాన్యం రైతులు పొందవచ్చునని ఆయన తెలిపారు.

రైతులకు సబ్సిడీతో కలిసి ధర చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మైబూబ్ అలీ

మిర్యాలగూడ, నవంబరు06 (ఆంధ్రజ్యోతి): రైతులకు సబ్సిడీతో కలిపి క్వింటాకు రూ.2,820 నేరుగా చెల్లించాలని మాజీ పీసీసీ కార్యదర్శి మైబూబ్‌అలీ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ కేంద్రాలకు రైతులు సన్నధాన్యాన్ని తేవడం లేదన్నారు. 17 శాతం తేమతో సన్న ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేసి రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించడం వల్ల రైతులకు ప్రయోజనం లేకుండా పోతోందన్నారు. పచ్చి ధాన్యం మిల్లర్ల వద్దకు తీసుకవెళ్తే 28 శాతం తేమకు కొంటున్నాం కాబట్టి క్వింటాకు 2,350- 2,400 వరకు చెల్లిస్తామని అంటున్నారని అన్నారు. ఎక్కడ అమ్మినా రైతులకు మద్దతు ధరతో పాటు సబ్సిడీ కల్పించాలని కోరారు. మిల్లర్లు మహీంద్ర రకం చింట్లను కొనుగోలు చేయనందున యాసంగిలో ఆ తరహా రకం సాగు చేసి రైతులు ఇబ్బందులు పడకుండా వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ స్టార్ క్యాంపెయిన్ జిల్లా చైర్మన్ పోలగాని వెంకటేశ్‌గౌడ్, కిరణ్ పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే బీఎల్‌ఆర్‌పై మల్లన్న విమర్శలు సరికాదు'

మిర్యాలగూడ, మిర్యాలగూడటౌన్ నవంబరు6: (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే బీఎల్‌ఆర్‌ను పొగిడిన మల్లన్న ఇప్పుడు తిట్టడం సరికాదని కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్ జిల్లా చైర్మన్ పోలగాని వెంకటేశ్‌గౌడ్, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నీరుకంటి నారాయణ అన్నారు. మిర్యాలగూడలో బుధవారం వేర్వేరుగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తీన్మార్ మల్లన్న మిర్యాలగూడ బీసీ గర్జన సభకు హాజరై బీసీ సమస్యలు, ఐక్యతపై మాట్లాడితే సబబుగా ఉండేదని అన్నారు. అధికార పార్టీలో ఉండి ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో అందరి సహకారం తీసుకుని ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే బీఎల్‌ఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. బీఎల్‌ఆర్ దశాబ్ద కాలంగా సేవ కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఈ సమావేశాల్లో కాంగ్రెస్ కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు బొంత పుల్లయ్య, మండల ప్రధాన కార్యదర్శి బొంగరాల కిరణ్, బీసీ నాయకులు పల్లా వెంకటయ్య, కిషన్ నాయక్ కుప్పాల సుబ్బారావు, పసుపులేటి శివ, వీరన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి



మిర్యాలగూడలో సర్వేను స్టిక్కర్లు పరిశీలిస్తున్న కమిషనర్

నిడమనూరు, నవంబరు 6: ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి న్యాయం చేయాలనే ఉద్దేశంతో సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ, కుల సర్వేను ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొండా శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ డెలిగేట్ ముంగి శివమారయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింగు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

● మిర్యాలగూడ టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సర్వేలో భాగంగా పట్టణ పరిధిలోని ప్రతి ఇంటికి స్టిక్కర్లు అతికిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్ తెలిపారు. పట్టణ ప్రజలు సర్వేకు సహకరించాలని, సిబ్బంది పూర్తి వివరాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు వెంకటరమణ, జ్ఞానేశ్వరి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

●గట్టుప్పల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో బుధవారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఎన్యుమరేటర్లు, అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికి తిరిగి యజమాని నుండి పలు వివరాలను సేకరించారు.సర్వేను తహసీల్దార్ రాములు పరిశీలించారు. ఎంపీవో మాధవరెడ్డి, ఎంఈవో అమృతా దేవి అధికారులు పాల్గొన్నారు.

● వేములపల్లి, నవంబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపాలెంలో ఎన్యుమరేటర్ల నిర్వహిస్తున్న సర్వేను ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ పరిశీలించారు. హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌నాయక్, సైదులు ఉన్నారు.

● కొండమల్లేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం తో పాటు పరిసర గ్రామాల్లో ఎన్యుమరేటర్లు, ఉద్యోగులు సర్వేలో పాల్గొని వివరాలు సేకరించారు వివరాలు సేకరించి ప్రతి ఇంటికి సర్వే స్టిక్కర్‌ను అంటించారు.

● నార్కట్‌పల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొత్తం 3,265 కుటుంబాలను సర్వే చేసినట్లు తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

త్రిపురారం నవంబరు6(ఆంధ్రజ్యోతి): త్రిపురారం సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ విద్యుత్‌లైన్ మార్పిడి పనులు జరుగుతున్నందున గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు త్రిపురారం హైస్కూల్ బజారు, బెజ్జికల్, మద్రిగూడెం ఫీడర్లకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

రేపు కిమ్స్‌లో వైద్య సదస్సు

నార్కట్‌పల్లి, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): నవజాత శిశువులకు చేసే వైద్య చికిత్సలపై శుక్రవారం సదస్సు నిర్వహిస్తున్నట్లు నార్కట్‌పల్లిలోని కామినేని వైద్య విద్యా కళాశాల ఓ ప్రకటనలో తెలిపింది. సదస్సుకు తెలుగు రాష్ట్రాల నుంచి అనుభవజ్ఞులైన చిన్నపిల్లల వైద్య నిపుణులు పాల్గొని ఆధునిక పద్ధతులపై అమూల్యమైన సలహాలు ఇస్తారని తెలిపారు.

9న రైతులకు ఉచిత శిక్షణ శిబిరం

మద్రిగూడ, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై మండలంలోని రైతులకు ఈనెల 9న ఉచిత శిక్షణ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం సభ్యుడు వినిల్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సు భారతి గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

టీడీపీ అడ్‌హక్ కమిటీ సభ్యుడిగా సైదులు గౌడ్

మిర్యాలగూడ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నల్లగొండ పార్లమెంట్ అడ్‌హక్ కమిటీ కమిటీ సభ్యుడిగా పట్టణానికి చెందిన పోగుల సైదులుగౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

చెకుముకి పరీక్షలతో శాస్త్రీయ దృక్పథం

దామరచర్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి పరీక్షల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం అలవడుతుందని ఎంఈవో బాలాజీ నాయక్ అన్నారు. మండలకేంద్రంలో బుధారం చెకుముకీ సంబురాలు-2024 పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పాఠశాల స్థాయిలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు గురువారం టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతిభ కనబరిచిన వారిని మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పరీక్షలు నిర్వహించి ప్రతిభావంతులను ప్రోత్సహిస్తామన్నారు. హెచ్‌ఎం బండా వెంకటరెడ్డి, కోల శ్రీనివాస్, డి.వెంకటేశ్వర్లు, పులగం రాధిక పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

వేములపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన జోకూరి స్వరూపకు రూ.44వేల, పాలకూరి సావిత్రకు రూ.27వేలు, బొల్లెపల్లి శివ కుమార్‌కు రూ.11,500 సీఎం సహాయ నిధి నుంచి మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును లబ్దిదారులకు మిర్యాలగూడ బ్లాక్ కాంగ్రెస్ సెక్రటరీ పేరెల్లి నగేష్, గ్రామశాఖ అధ్యక్షుడు పాదూరి కిరణ్‌రెడ్డి అందజేశారు . కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ రెమడాల కరుణాకర్, నాయకులు రాచూరి వెంకన్న, బారి పాండు, బొడ్డు జానకిరాములు, బొమ్మగాని సైదులు, ఐతగాని నాగరాజు ఉన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

చందంపేట, నవంబరు6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి బుధవారం చందంపేటలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మాతంగి కాశయ్య కొండపల్లి నగేష్, చంద్రశేఖర్, గిరి, జబ్బు శ్రీశైలం, అంజనేయులు పాల్గొన్నారు.

ప్రపంచంలోనే పెద్ద రాజకీయ పార్టీ బీజేపీ

చిట్యాల, నవంబర్ 6, (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ అవతరించిందని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గందమల్ల శ్రీనివాస్‌గౌడ్, కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. చిట్యాలలో బుధవారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదులో వారు మాట్లాడారు. కార్యక్రమంలో మాన శ్రీనివాస్, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, పోతే పాక లింగస్వామి, నాగాచారి, మహలింగం పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పార్టీ సభ్యత్వ నమోదులో లక్ష్యాన్ని చేరుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న పిలుపునిచ్చారు. బుధవారం నార్కట్‌పల్లిలో నిర్వహించిన పార్టీ మండల స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో సభ్యత్వాల నమోదుపై సంతృప్తి చెందారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొర్వి శంకర్, తాటిపాముల కృష్ణ, పాల్వాయి భాస్కర్‌రావు, లింగాల వీరయ్య, మునుకుంట్ల గణేశ్, మేడబోయిన శ్రీనివాస్, పాల్గొన్నారు.

హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి



రాస్తారోకో చేస్తున్న వెంకటయ్య కుటుంబ సభ్యులు

దేవరకొండ, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): పీఏపల్లి మండలం పెద్దగుమ్మడం గ్రామానికి చెందిన మస్క వెంకటయ్య(35) మృతిపై విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మృతుడి బంధువులు, దళితసంఘాలు బుధవారం దేవరకొండలో రాస్తారోకో నిర్వహించారు. వెంకటయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ఆసుపత్రికి తీసుకువచ్చిన కుటుంబ సభ్యులు మృతుడి ఒంటిపై గాయాలు ఉండడంతో కొందరు దుండగులు హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. ఆసుపత్రి ఎదుట రోడ్డుపై 20 నిమిషాలపాట రాస్తారోకో చేశారు. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. దేవరకొండ సీఐ నర్సింహులు సంఘటన స్థలానికి చేరుకొని న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుడి భార్య మంజుల, నాయకులు మాతంగి కాశయ్య, నారయ్య, శ్రీనివాస్, జల్ల రాములు, గ్యార వెంకటయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

సీతారామాంజనేయస్వామి ఆలయ కమిటీ

మిర్యాలగూడ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపు సీతారామాంజనేయస్వామి ఆలయ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొల్లగోపు సాయిలు, ఉపాధ్యక్షుడిగా గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఇరువంటి రవీందర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆలయ పూజారి వెంకటాచార్యులు, సభ్యులు మందడి లక్ష్మమ్మ, అంజయ్య, సైదాచారి పాల్గొన్నారు.